సింధు నది జలాల ఒప్పందంపై సమీక్ష

పాకిస్థాన్‌కు భారత్ నోటీసు

న్యూఢిల్లీ: భారత్-పాకిస్థాన్ మధ్య 1960లో కుదిరిన సింధు నదీ జలాల ఒప్పందంలో మార్పులు జరగాలని భారత్ కోరింది. ఏకపక్ష ఒప్పందం కొనసాగుతున్నదని, నేటి పరిస్థితులకు తగినట్లుగా ఈ ఒప్పందంలోని నిబంధనలను మదింపు చేయాలని చెప్పింది. ఈ మేరకు గత నెల 30న పాకిస్థాన్‌కు నోటీసు పంపినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. నదీ జలాల వినియోగం, జనాభా పరిస్థితులు మారుతున్నాయని ఈ నోటీసులో భారత్ తెలిపింది. పరిశుద్ధ ఇంధనం దిశగా భారత్ ముందడుగు వేస్తున్నదని, అందువల్ల ఈ ఒప్పందాన్ని సవరించాలని కోరింది.

రైల్లోకి ఉడుతలు.. సర్వీసు రద్దు

లండన్ : బ్రిటన్‌లో విచిత్ర ఘటన జరిగింది. శనివారం ఉదయం దక్షిణ ఇంగ్లండ్‌లోని రీడింగ్ నుంచి గాట్విక్ ఎయిర్‌పోర్టుకు బయలుదేరిన ఓ రైలు గోమ్‌షాల్ వద్దకు చేరుకోగానే ఓ బోగీలోకి రెండు ఉడుతలు ప్రవేశించాయి. దీంతో ఆ బోగీలోని ప్రయాణికులు హడలెత్తి మరో బోగీలోకి పరుగు లు తీశారు. ఆ రైలు సర్రీలోని రెడ్‌హిల్ స్టేషన్‌కు చేరుకోగానే సిబ్బంది రంగంలోకి దిగి ఆ ఉడుతలను బయటికి తరిమేందుకు యత్నించారు. కానీ, వాటిలో ఓ ఉడుత రైలు దిగకుండా మొండికేయడంతో గమ్యస్థానానికి చేరక ముందే ఆ రైలు సర్వీసును రద్దు చేయాల్సి వచ్చినట్టు గ్రేట్ వెస్టన్ రైల్వే అధికారులు వెల్లడించారు.

జూన్-ఆగస్టు మధ్య రికార్డు ఉష్ణోగ్రతలు

న్యూఢిల్లీ: భారత్‌లో అనూహ్యమైన వాతావరణ మార్పులపై అమెరికా సైంటిస్టులు, నిపుణులు కీలక విషయాన్ని వెల్లడించారు. 1970 తర్వాత భారత్‌లో ఈ ఏడాది జూన్-ఆగస్టు త్రైమాసికంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని, రెండో అత్యంత వేడి త్రైమాసికంగా నిలిచిందని 'క్లైమేట్ సెంట్రల్' నివేదిక తెలిపింది. జనాభాలో మూడోవంతు మంది ఏడు రోజులు ప్రమాదకరమైన వేడిని భరించారని పేర్కొన్నది.

పేలిన వాకీటాకీలు

- రేడియోలు, ఫోన్లు, సోలార్ ప్యానళ్లు సైతం?
- లెబనాన్‌లో హెజ్బొల్లా లక్ష్యంగా అనూహ్య దాడులు
- 14 మంది మృతి.. సుమారు 300 మందికి గాయాలు

బీరుట్, సెప్టెంబర్ 18: లెబనాన్‌లో మరోసారి అనూహ్య పేలుళ్లు సంభవించాయి. మంగళవారం ఒకేసారి వందలాది పేజర్లు పేలిపోగా, బుధవారం వైర్‌లెస్ పరికరాలైన వాకీ టాకీలు, రేడియోలు పేలిపోయాయి. స్మార్ట్‌ఫోన్‌లు, ఇంటర్‌కామ్‌లు, సోలార్ ప్యానళ్లు సైతం పేలిపోతున్నట్టు స్థానికులు చెప్తున్నారు. రాజధాని బీరుట్ సహా తూర్పు, దక్షిణ లెబనాన్‌లోని వేర్వేరు ప్రాంతాల్లో హెజ్బొల్లా సభ్యులే లక్ష్యంగా ఏకకాలంలో ఈ పేలుళ్లు సంభవించాయి. ఈ ఘటనల్లో 14 మంది మరణించారు. 300 మంది వరకు గాయపడ్డట్టు తెలుస్తున్నది. దహియే ప్రాంతంలో పేజర్ల పేలుళ్లలో మరణించిన వారి అంత్యక్రియలు జరుగుతుండగా ఓ పేలుడు సంభవించింది. పేలిన వాకీ టాకీలు, రేడియోలను ఐదు నెలల క్రితం కొనుగోలు చేశారు. కాగా, ఈ పేలుళ్లకు ఇజ్రాయెలే కారణమని, పేజర్లు, వాకీటాకీల్లో ఆ దేశ నిఘా సంస్థ మొస్సాద్ పేలుడు పదార్థాలు అమర్చిందని హెజ్బొల్లా ఆరోపించింది. కాగా, మంగళవారం నాటి పేజర్ల పేలుళ్లలో 12 మంది మరణించారని, 2,800 మంది గాయపడ్డారని లెబనాన్ ఆరోగ్య శాఖ మంత్రి ఫిరాస్ అబైద్ ప్రకటించారు. మరోవైపు, ఈ దాడి తర్వాత అమెరికాకు ఇజ్రాయెల్ సమాచారం ఇచ్చిందని, పేజర్లలో స్వల్ప మోతాదులో పేలుడు పదార్థాలు అమర్చి ఉన్నట్టు అమెరికాకు చెందిన ఓ అధికారి అనధికారికంగా వెల్లడించారు. ఈ పేలుళ్లపై ఇజ్రాయెల్ మాత్రం స్పందించలేదు. లెబనాన్‌లో రెండు రోజులుగా పేలుళ్లు జరుగుతున్న నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి శుక్రవారం సమావేశం కావాలని నిర్ణయించింది.

పేజర్లు మేము తయారు చేయలేదు: గోల్డ్ అపోలో

లెబనాన్‌లో పేలిన ఏఆర్-924 రకం పేజర్లను తాము తయారు చేయలేదని తైవాన్‌కు చెందిన గోల్డ్ అపోలో సంస్థ ప్రకటించింది. హంగేరీ రాజధాని బుడాపెస్ట్‌కు చెందిన బీఏసీ కన్సల్టింగ్ అనే సంస్థ వీటిని తయారు చేసిందని, తమ బ్రాండ్‌తో విక్రయించిందని పేర్కొన్నది.

పేజర్లు ఎలా పేలాయి?

- ఇప్పటికీ వీటిపైనే ఆధారపడ్డ హెజ్బొల్లా
- ఇజ్రాయెల్‌కు చిక్కకుండా జాగ్రత్తలు
- ఇటీవల తైవాన్ నుంచి 5 వేలు దిగుమతి
- వీటిల్లో ఇజ్రాయెల్ పేలుడు పదార్థాలు?

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18: లెబనాన్‌లో ఏకకాలంలో వందల సంఖ్యలో పేజర్లు పేలిపోవడం సంచలనంగా మారింది. మంగళవారం జరిగిన ఘటనల్లో 12 మంది మరణించడంతో పాటు దాదాపు 2,800 మంది గాయపడ్డారు. సెల్‌ఫోన్‌ల యుగం మొదలైన తర్వాత ప్రపంచ వ్యాప్తంగా కనుమరుగైన పేజర్లను హెజ్బొల్లా ఇంకా ఎందుకు వినియోగిస్తున్నది? ఒకేసారి వేల సంఖ్యలో పేజర్లు ఎలా పేలిపోయాయి? ఈ తరానికి పెద్దగా తెలియని పేజర్ల కథ ఏంటి? వంటివి ఇప్పుడు ఆసక్తికరంగా మారాయి.

పేజర్లు అంటే ఏంటి?

అరచేతిలో ఇమిడిపోయేంత చిన్న పరికరమైన పేజర్‌ను 1949లో ఆల్ఫ్రెడ్ గ్రాస్ కనుగొన్నారు. 1964లో మోటోరోలా కంపెనీ 'పేజ్‌బాయ్ 1' పేరుతో మొదటి పేజర్‌ను మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. పేజర్లకు ఉండే కాలిక్యులేటర్ లాంటి స్క్రీన్‌పై చిన్న మెసేజ్‌లు పంపించే వీలు ఉండేది. కేవలం మెసేజ్ చేసుకోవడానికి పేజర్లు పని చేసేవి. 1990ల చివరి వరకు అత్యవసర సందేశాలను పొందేందుకు వీటిని చాలా మంది వినియోగించే వారు. తర్వాత సెల్‌ఫోన్‌ల రాక మొదలైన తర్వాత వీటి వినియోగం క్రమంగా తగ్గిపోయి, 2000ల నాటికి పూర్తిగా కనుమరుగయ్యాయి.

హెజ్బొల్లా ఇంకా ఎందుకు వాడుతున్నది?

పేజర్లు రేడియో ఫ్రీక్వెన్సీ సిగ్నళ్ల ద్వారా పని చేస్తాయి. మొబైల్ నెట్‌వర్క్ అవసరం వీటికి లేదు. తమ జాడను ఇజ్రాయెల్ బలగాలు కనుగొనే వీలు లేకుండా, లొకేషన్ ట్రాకింగ్ సాధ్యం కాని పేజర్లను హెజ్బొల్లా సాయుధులు ఇంకా వినియోగిస్తున్నారు. యుద్ధ ప్రాంతాల్లో వీటికి సిగ్నళ్ల అంతరాయం, నెట్‌వర్క్ సమస్యలు కూడా ఉండవు. కాబట్టి, కేవలం హెజ్బొల్లా ఫైటర్లు సందేశాలు పంపుకునేందుకు మాత్రమే ఇవి పని చేస్తాయి.

ఒకేసారి ఎలా పేలాయి?

హెజ్బొల్లా సాయుధులు వాడుతున్న వేలాది పేజర్లు ఒకేసారి పేలిపోవడం వెనుక ఇజ్రాయెల్ పాత్ర ఉందనే కథనాలు వస్తున్నాయి. ఈ పేజర్లన్నీ గత ఏడాది కాలంలోనే కొనుగోలు చేసినవి. వీటిని తైవాన్‌కు చెందిన 'గోల్డ్ అపోలో' అనే కంపెనీ నుంచి హెజ్బొల్లా కొనుగోలు చేసింది. తయారు చేసే సమయంలోనే వీటిల్లో ఇజ్రాయెల్ నిఘా సంస్థ మొస్సాద్ పేలుడు పదార్థాలు అమర్చిందనే వార్తలు వస్తున్నాయి. అయితే, కనిష్ట సాంకేతికతతో నడిచే పేజర్లను ఒకేసారి ఎలా పేల్చగలిగిందనేది ఇప్పటివరకు ఎవరికీ అంతు చిక్కడం లేదు.

అంధత్వ నిర్మూలనకు 'బ్లైండ్‌సైట్'

- చూపులేనివారికి తిరిగి చూపు
- ఎలాన్‌మస్క్ 'న్యూరాలింక్'కు అనుమతిచ్చిన అమెరికా ఎఫ్‌డీఏ



న్యూయార్క్, సెప్టెంబర్ 18: టెస్లా అధినేత ఎలాన్ మస్క్ మరో సంచలనానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటికే మనిషి మెదడులో చిప్ పెట్టిన ఆయన స్టార్టప్ కంపెనీ 'న్యూరాలింక్'.. ఇప్పుడు చూపు లేని వారికి చూపు తెప్పించే పరికరాన్ని తయారు చేయబోతున్నది. పుట్టుకతో చూపులేని వారికి, మధ్యలో చూపు కోల్పోయిన వారిలో చూపు కల్పించే 'బ్లైండ్‌సైట్' డివైజ్‌ను అమర్చేందుకు అమెరికాకు చెందిన యూఎస్ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డీఏ) ఈ సంస్థకు అనుమతి ఇచ్చింది. రెండు కండ్లు పోయినా, ఆప్టిక్ నరం దెబ్బతిన్నా.. ఈ పరికరంతో లోకాన్ని చూడొచ్చని కంపెనీ వెల్లడించింది.

పరికరం పని చేస్తుందిలా..

ఎలాన్‌మస్క్ ప్రకారం.. పుట్టుకతో అంధులైన వారికి కూడా ఈ పరికరం ఉపయుక్తంగా పనిచేస్తుంది. దీన్ని వాడిన మొదట్లో దృష్టి సామర్థ్యం తక్కువగా ఉంటుంది.. కాలక్రమేణా సహజమైన కంటిచూపు కంటే మెరుగైన సామర్థ్యం వస్తుంది. అతినీలలోహిత కిరణాలను కూడా ఎలాంటి ప్రభావం లేకుండా భేషుగ్గా చూడొచ్చు. మెదడులోని విజువల్ కార్టెక్స్‌కు ఒక మైక్రో ఎలక్ట్రోడ్‌ను అమర్చి ప్రపంచాన్ని వీక్షించొచ్చు. దానికోసం ఒక కెమెరాను కూడా అమర్చుతారు. దానితో న్యూరాన్లు యాక్టివేట్ అయ్యి చూపును కలుగజేస్తారు. మనుషులపై ప్రయోగాలకు పట్టే సమయంపై మస్క్ ఎలాంటి సమాచారం ఇవ్వలేదు.

తేజస్ తొలి మహిళా ఫైటర్ పైలట్‌గా మోహనాసింగ్

జోధ్‌పూర్: భారత ఏవియేషన్ చరిత్రలో స్క్వాడ్రన్ లీడర్ మోహనాసింగ్ తన పేరును చిరస్థాయిగా లిఖించుకున్నారు. దేశీయంగా అభివృద్ధి చేసిన తేలికపాటి యుద్ధ విమానం తేజస్ ఫైటర్ జెట్ స్క్వాడ్రన్ నిర్వహించే ఎలైట్ 18 'ఫ్లయింగ్ బులెట్స్' స్క్వాడ్రన్‌లో తొలి మహిళా ఫైటర్ పైలట్‌గా రికార్డులకెక్కారు. భారత వైమానిక దళంలోని ముగ్గురు మహిళా పైలట్లలో స్క్వాడ్రన్ లీడర్ మోహనాసింగ్ ఒకరు. మిగతా ఇద్దరిలో ఒకరు స్క్వాడ్రన్ లీడర్ భావనాకాంత్ కాగా, మరొకరు స్క్వాడ్రన్ లీడర్ అవనీ చతుర్వేది. ఇటీవలి వరకు ఆమె సుఖోయ్ ఎస్‌యు-30 ఎంకేఐ ఫైటర్ జెట్స్ నడిపారు. ఆ తర్వాత ఆమె గుజరాత్ సెక్టార్‌లోని నలియా ఎయిర్‌బేస్‌లో మోహరించిన ఎల్‌సీఏ స్క్వాడ్రన్‌కు బదిలీ అయ్యారు. 2016లో ప్రభుత్వం మహిళల కోసం ఫైటర్ స్ట్రీమ్‌ను ప్రారంభించిన తర్వాత ఐఏఎఫ్‌లో దాదాపు 20 మంది మహిళా ఫైటర్ పైలట్లు ఉన్నారు.

బుక్కు.. తుక్కు

విద్యార్థులకు ఉచితంగా అందించాల్సిన వేలాది ప్రభుత్వ పాఠ్య పుస్తకాలు రాయ్‌పూర్‌కు సమీపంలోని ఓ లిస్టైకింగ్‌లో సెంటర్‌లో 'తుక్కు'గా కనిపించడం బీజేపీ పాలిత ఛత్తీస్‌గఢ్‌లో పెను దుమారం లేపింది. దీనిపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. మరోవైపు పాఠ్య పుస్తకాలు లేక, పరీక్షలకు సరిగ్గాసంసిద్ధులు కాలేకపోతున్నామని రాష్ట్రవ్యాప్తంగా పలువురు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

చిత్రం

వెట్రిమారన్‌తో సినిమా చేయాలి!

సామాజిక స్పృహ, సహజత్వం కలబోసిన రా అండ్ రస్టిక్ సినిమాలతో దర్శకుడిగా తనదైన ముద్రతో సాగిపోతున్నారు తమిళ డైరెక్టర్ వెట్రిమారన్. ఇక తిరుగులేని మాస్ ఫాలోయింగ్‌తో మ్యాన్ ఆఫ్ మాసెస్‌గా గుర్తింపు పొందారు అగ్ర హీరో ఎన్టీఆర్. వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమా కార్యరూపం దాల్చితే అది ఏ స్థాయిలో ఉంటుందో ఊహించుకోవచ్చు. తాజాగా చెన్నైలో నిర్వహించిన 'దేవర' ప్రచార కార్యక్రమం ఎన్టీఆర్-వెట్రిమారన్ కాంబినేషన్ సినిమా గురించి మరోమారు చర్చకు తెరతీసింది. తమిళంలో స్ట్రెయిట్ సినిమా ఎప్పుడు చేయబోతున్నారు? అది ఏ దర్శకుడితో? అని వ్యాఖ్యాత ఎన్టీఆర్‌ను అడగ్గా...తమిళంలో వెట్రిమారన్ తన ఫేవరేట్ దర్శకుడని, ఆయనతో సినిమా చేయాలన్నది తన డ్రీమ్ అని ఎన్టీఆర్ చెప్పారు. దీంతో వీరిద్దరి కాంబినేషన్ గురించి మరోమారు చర్చలు మొదలయ్యాయి. అయితే నాలుగేళ్ల క్రితమే ఎన్టీఆర్‌తో వెట్రిమారన్ సినిమా చేయబోతున్నారనే వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. లాక్‌డౌన్ తర్వాత తాను ఎన్టీఆర్‌కు స్టోరీ చెప్పానని వెట్రిమారన్ ఓ సందర్భంలో చెప్పారు. అప్పటి నుంచి వీరిద్దరి కాంబినేషన్ గురించి చర్చ జరుగుతూనే ఉంది. ఎన్టీఆర్ తాజా వ్యాఖ్యలతో ఇప్పుడు కాకపోయినా సమీప భవిష్యత్తులో ఈ కాంబినేషన్ కార్యరూపం దాల్చే అవకాశాలున్నాయని అభిమానులు అభిప్రాయపడుతున్నారు.

రెండింతల వినోదంతో 'మ్యాడ్ స్క్వేర్'

సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ నిర్మించిన 'మ్యాడ్' చిత్రం ఆద్యంతం చక్కటి హాస్యంతో ప్రేక్షకుల్ని మెప్పించింది. ముఖ్యంగా యువతరాన్ని బాగా ఆకట్టుకుంది. బాక్సాఫీస్ వద్ద కూడా ఈ సినిమా మంచి వసూళ్లను సాధించింది. నార్నే నితిన్, సంగీత్‌శోభన్, రామ్ నితిన్ ప్రధాన పాత్రల్ని పోషించిన ఈ వినోదాత్మక చిత్రానికి సీక్వెల్‌గా 'మ్యాడ్ స్క్వేర్' రానున్న విషయం తెలిసిందే. బుధవారం ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో మ్యాడ్‌గ్యాంగ్ సంప్రదాయ దుస్తుల్లో కనిపిస్తున్నారు. తొలి భాగానికి భిన్నంగా వారి వేషధారణ, లుక్స్ కనిపించడం ఆసక్తినిరేకెత్తిస్తున్నది. మ్యాడ్ గ్యాంగ్‌ను ఈ సీక్వెల్‌లో సరికొత్తరీతిలో పరిచయం చేయబోతున్నామని, తొలిభాగం కంటే రెండింతల వినోదంతో మెప్పిస్తుందని, ఈ నెల 20న తొలి గీతాన్ని విడుదల చేయబోతున్నామని చిత్ర బృందం పేర్కొంది. 'మ్యాడ్' సినిమాకు పనిచేసిన దర్శకుడు, సాంకేతిక నిపుణులందరూ ఈ సీక్వెల్‌కు పనిచేస్తున్నారని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సూర్యదేవర నాగవంశీ సమర్పకుడిగా వ్యవహరిస్తుండగా, హారిక సూర్యదేవర, సాయిసౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

మత్తు మంచిది కాదని చెప్పాం!

''మత్తు వదలరా-2' చిత్రానికి అంతటా మంచి ఆదరణ లభిస్తున్నదని..చిరంజీవి, మహేష్‌బాబు వంటి అగ్ర హీరోలు బాగుందని ప్రశంసించడం ఎంతో ఉత్సాహాన్నిచ్చిందని చెప్పారు చిత్ర దర్శకుడు రితేష్ రానా. శ్రీసింహా కోడూరి, సత్య ప్రధాన పాత్రల్లో రూపొందిన కామెడీ థ్రిల్లర్ 'మత్తు వదలరా-2' ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సందర్భంగా బుధవారం చిత్ర దర్శకుడు రితేష్ రానా పాత్రికేయులతో మాట్లాడుతూ 'సీక్వెల్ చేయాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నా. మంచి ఐడియా రావడంతో నిర్మాత చెర్రీగారికి చెప్పాను. ఆ పాయింట్ అందరికి నచ్చడంతో సీక్వెల్‌ను మొదలుపెట్టాం' అన్నారు. సినిమాలో సింహా, సత్య, అజయ్ ఆద్యంతం చక్కటి కామెడీతో నవ్విస్తున్నారని, మత్తు అంటే కేవలం డ్రగ్స్ మాత్రమే కాదని, అది చాలా రకాలుగా ఉంటుందని, ఎలాంటి మత్తు నుంచి అయినా బయటపడాలనే అంతర్లీన సందేశంతో సినిమా తీశామని అన్నారు. ఫరియా అబ్దుల్లా చేసిన ర్యాప్‌సాంగ్ హైలైట్‌గా నిలిచిందని, ఆమెను దృష్టిలో పెట్టుకొని క్యారెక్టర్ డిజైన్ చేశానని రితేష్ రానా తెలిపారు. రాజమౌళిగారికి కూడా ఈ సినిమా బాగా నచ్చిందని, ఆయన సినిమాను బాగా ఎంజాయ్ చేశారని రితేష్ అన్నారు. ఈ సినిమాకు పార్ట్-3 కూడా ఉంటుందని, తన తదుపరి సినిమా వివరాలను త్వరలో తెలియజేస్తానని రితేష్ రానా పేర్కొన్నారు.

బయటే రక్షణ లేదు!

మలయాళ సినీరంగంపై జస్టిస్ హేమ కమిటీ రిపోర్ట్ అనంతరం ఫిల్మ్ ఇండస్ట్రీలో మహిళలపై లైంగిక వేధింపులు, క్యాస్టింగ్ కౌచ్ అంశాలు మరోసారి తీవ్ర చర్చకు దారితీశాయి. ఈ వ్యవహారంపై పలువురు సినీ తారలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. తాజాగా కన్నడ భామ శ్రద్ధా శ్రీనాథ్ సినీరంగంలో క్యాస్టింగ్ కౌచ్, మహిళల భద్రత గురించి ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. సినీరంగంలో క్యాస్టింగ్ కౌచ్ జరిగేది నిజమేనని, అయితే తాను మాత్రం అలాంటి చేదు అనుభవాలను ఎప్పుడూ ఎదుర్కోలేదని చెప్పింది. నిజం చెప్పాలంటే సినీరంగంలో కంటే బయటి సమాజంలోనే మహిళలకు రక్షణ కరువైందని అభిప్రాయపడింది. 'ఈ విషయాన్ని అందరూ ఒప్పుకోవాలి. సమాజంలో మహిళలపై దారుణమైన నేరాలు జరుగుతున్నాయి. ఒంటరిగా కారులో వెళ్లాలంటే భయపడే పరిస్థితులు ఉన్నాయి. మహిళలు ఒంటరిగా ప్రయాణం చేస్తూ ధైర్యంగా ఉండలేకపోతున్నారు. ఈ పరిస్థితుల్లో మార్పు రావాలి' అని శ్రద్ధా శ్రీనాథ్ చెప్పుకొచ్చింది. నానితో కలిసి నటించిన 'జెర్సీ' సినిమాతో ఈ భామ తెలుగులో మంచి గుర్తింపును సంపాదించుకుంది. అనంతరం వెంకటేష్ సరసన 'సైంధవ్' చిత్రంలో కూడా నటించింది.

ఉపేంద్ర పీరియాడిక్ థ్రిల్లర్

వైవిధ్యమైన కథాంశాలతో విలక్షణ నటుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు కన్నడ హీరో ఉపేంద్ర. ఆయన స్వీయ దర్శకత్వంలో నటిస్తున్న చిత్రం 'యూఐ'. జి.మనోహరన్, కేపీ శ్రీకాంత్ నిర్మాతలు. పీరియాడిక్ ఫాంటసీ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని అక్టోబర్‌లో విడుదల చేయబోతున్నారు. బుధవారం ఉపేంద్ర జన్మదినం సందర్భంగా కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఉపేంద్ర కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో రూపొందిస్తున్న చిత్రమిదని, ప్రేక్షకులను సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తుందని, నటుడిగా ఉపేంద్ర విశ్వరూపాన్ని చూస్తారని మేకర్స్ తెలిపారు. రీష్మా, నిధి సుబ్బయ్య, మురళీశర్మ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి 'కాంతార' ఫేమ్ అజనీష్ లోక్‌నాథ్ సంగీతాన్నందిస్తున్నారు.

'జర్నీ' రీరిలీజ్

శర్వానంద్, అనన్య, జై, అంజలి ప్రధాన పాత్రల్లో నటించిన 'జర్నీ' చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సాధించింది. మ్యూజికల్ లవ్‌స్టోరీగా హృదయాన్ని కదిలించే భావోద్వేగాలతో ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. తాజాగా ఈ సినిమాను ఈ నెల 21న రీరిలీజ్ చేయబోతున్నారు. లక్ష్మీనరసింహా మూవీస్ పతాకంపై సుప్రియ శ్రీనివాస్ తెలుగులో రీరిలీజ్ చేస్తున్నారు. ఇప్పటికే బుకింగ్స్ కూడా మొదలయ్యాయని, పన్నెండేళ్ల తర్వాత రీరిలీజ్‌కు సిద్ధమవుతున్న ఈ చిత్రానికి అప్పటిలాగే ప్రేక్షకులు ఆదరణ కనబరుస్తారనే నమ్మకం ఉందని మేకర్స్ తెలిపారు.

'స్పిరిట్'కు 500 కోట్ల బడ్జెట్

ప్రభాస్ కథానాయకుడిగా సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో 'స్పిరిట్' పేరుతో భారీ పాన్ ఇండియా చిత్రం తెరకెక్కబోతున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ ఏడాది ఆఖరులో షూటింగ్‌ను మొదలుపెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. 'కల్కి'తో ప్రభాస్, 'యానిమల్' సినిమాతో దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా పాన్ ఇండియా స్థాయిలో అద్భుత విజయాల్ని సొంతం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో వీరిద్దరి కాంబినేషన్‌పై దేశవ్యాప్తంగా ఉన్న సినీ ప్రేమికుల్లో ఆసక్తి పెరిగిపోతున్నది. ఈ సినిమాలో ప్రభాస్ పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నారు. కెరీర్‌లో తొలిసారి ఆయన పోలీస్ పాత్రను చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా బడ్జెట్ గురించి ఓ ఇంట్రెస్టింగ్ అప్‌డేట్ సోషల్‌మీడియాలో చక్కర్లు కొడుతున్నది. దాదాపు 500 కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను తెరకెక్కించేందుకు ప్లాన్ చేస్తున్నారని తెలిసింది. హాలీవుడ్ స్థాయిలో యాక్షన్ హంగులు, స్పెషల్ ఎఫెక్ట్స్‌తో ఈ సినిమాను తీర్చిదిద్దబోతున్నారని, బడ్జెట్ విషయంలో అన్‌కాంప్రమైజ్డ్‌గా ఉండాలని దర్శకుడు సందీప్ రెడ్డి నిర్ణయించుకున్నారని బాలీవుడ్ వర్గాల్లో వినిపిస్తున్నది.

బీటెక్‌లో మిస్సయ్యాను కొంచెంలో..

విశ్వక్‌సేన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'మెకానిక్ రాకీ'. రవితేజ ముళ్లపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని రామ్ తాళ్లూరి నిర్మిస్తున్నారు. మీనాక్షి చౌదరి కథానాయిక. దీపావళి సందర్భంగా అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకురానుంది. బుధవారం ఈ సినిమా నుంచి 'ఓ పిల్లా..' అంటూ సాగే రెండో గీతాన్ని విడుదల చేశారు. జేక్స్ బిజోయ్ స్వరాలను సమకూర్చిన ఈ పాటను కృష్ణచైతన్య రాయగా.. నకాష్ అజీజ్ ఆలపించారు. 'ఓ పిల్లో..బీటెక్‌లో మిస్సయ్యానే నిన్నే కొంచెంలో.. ఇవాళో, రేపట్లో నిన్నైతే సెట్ చేస్తానే తొందర్లో..' అంటూ రొమాంటిక్ గీతంగా మెప్పిస్తున్నది. విశ్వక్‌సేన్, మీనాక్షి చౌదరి మధ్య కెమిస్ట్రీ ఆకట్టుకుంది. కాలేజీ రోజుల్లో తాను ఇష్టపడిన అమ్మాయిని హీరో చాలా ఏళ్ల తర్వాత కలుసుకుంటాడు. ఆ సమయంలో అతని మదిలోని భావాలను ఆవిష్కరిస్తూ ఈ పాటను రూపొందించామని దర్శకుడు తెలిపారు. శ్రద్ధాశ్రీనాథ్, నరేష్, వైవా హర్ష తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జేక్స్ బిజోయ్, రచన-దర్శకత్వం: రవితేజ ముళ్లపూడి.

అన్ని కళల్లో నాటకం గొప్పది

దిలీప్ ప్రకాష్, రెజీనా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఉత్సవం'. అర్జున్‌సాయి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని సురేష్ పాటిల్ నిర్మించారు. నాటకరంగం నేపథ్య కథాంశంతో రూపొందిన ఈ చిత్రం ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన సక్సెస్‌మీట్‌లో సురభి నాటకరంగం కళాకారులను చిత్ర బృందం సత్కరించింది. ఈ సందర్భంగా నటుడు అలీ మాట్లాడుతూ ..నాటకరంగం నుంచి వచ్చిన వారు పరిశ్రమలో గొప్ప నటులుగా ఎదిగారని, ఈ నేపథ్యంలో సినిమా చేయడం చాలా గొప్ప విషయమని, ఇలాంటి మంచి సినిమాలను ప్రోత్సహించాలని అన్నారు. అన్ని కళల్లో నాటకం గొప్పదని, నాటకం బ్యాక్‌డ్రాప్‌లో ఫ్యామిలీ డ్రామా, లవ్‌స్టోరీ కలబోసి ఈ సినిమా చేశానని, చూసిన వారందరూ మంచి ప్రయత్నమని అభినందిస్తున్నారని దర్శకుడు అర్జున్ సాయి తెలిపారు. విడుదలైన అన్ని కేంద్రాల్లో మంచి స్పందన లభిస్తున్నదని నిర్మాత సురేష్ పాటిల్ పేర్కొన్నారు.